క్లుప్తంగా

లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం **ఉదయం ఘనం**గా ప్రారంభం అయ్యాయి. **ప్రత్యేక కుంకుమ** పూజలు, అభిషేకాలు నిర్వహించారు. **రాత్రి 7** గంటలకు స్వామి వారి కల్యాణం **జరిగింది.** తొలి రోజు స్వామి వారిని భక్తులు **పెద్ద ఎత్తున** దర్శించుకున్నట్లు ఆలయ వ్య**వస్థాపక ధర్మకర్త** డొండా వరహాలుదొర (కుమార్) **తెలిపారు.**

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మాకవరపాలెం: సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. మండలంలోని లచ్చన్నపాలెంలో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద మూడు రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సీతారాముల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రామాలయానికి స్టీలు గ్లాసుల విరాళం



ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావుకు స్టీల్‌గ్లాసులు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం రామాలయానికి 51 స్టీలు గ్లాసులను గ్రామానికి చెందిన గూనుపూడి నాగేశ్వరరావు శనివారం రాత్రి ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావుకు ఆలయంలో అందజేశారు. కార్యక్రమములో జిల్లా విశ్వ హిందూ పరిషత్ ధర్మ ప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి, స్థానిక భజన బృందం సభ్యులు పాల్గొన్నారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను గ్రామస్తులు, భజన బృందం సభ్యులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



కంటి పరీక్ష చేస్తున్న వైద్యాధికారి రాజు

కె.కోటపాడు: దాలివలసలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో కంటి, గుండె సంబంధ పరీక్షలు చేశారు. మెడికవర్, ఎస్‌పీ కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు 186 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే కంటి సమస్యలకు మెరుగైన వైద్యం అందించవచ్చని వైద్యాధికారి ఎంఎస్ఎల్ రాజు అన్నారు. పినాకిల్ ఆస్పత్రి వైద్యులు వై.శ్రావణ్‌బాబు, జి.భాగ్యరాజు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తోనే ప్రభుత్వ పథకాలకు అర్హత



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట: రైతుల మేలు కోసం ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 25 వరకే ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె రిజిస్ట్రేషన్ ఆవశ్యకత గురించి విలేకరులతో మాట్లాడారు. దీనికి ఆధార్ కార్డు, పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలు తీసుకుని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వ పథకాలకు అర్హులు కావాలని ఆమె తెలిపారు.

కోడి పందాలు ఆడుతున్న వారిపై పోలీసుల దాడులు

గొలుగొండ: శనివారం ఏటిగైరంపేట పంచాయతీ శివారు ముంగర్లపాలెం వద్ద కోడి పందాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేసి నలుగురు వ్యక్తులు, రెండు కోడి పుంజులను పట్టుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. గ్రామాల్లో పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంగళాపురంలో..

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో శనివారం తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందాలు, గుళ్లాటలపై వచ్చిన సమాచారంతో బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో దాడి చేశారు. రెండు కోడి పుంజులు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 1,600 నగదు, గుళ్లాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి రూ.1,400 నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

- చక్కటి ఫలసాయంతో రైతుల్లో ఆనందం
- కూలీలు, యంత్రాల కొరత

జోరందుకున్న.. వరి నూర్పులు



ధాన్యాన్ని వడపోస్తున్న రైతులు



నూర్పు యంత్రంతో వరి నూరుస్తున్న దృశ్యం



దిగుబడి అయిన ధాన్యం బస్తాలు

చోడవరం: వరి నూర్పులు జోరందుకున్నాయి. కోతలు కోసి, కుప్పలు పెట్టిన వరి పంట ప్రస్తుతం నూర్పులు చేస్తున్నారు. సంక్రాంతి పండగ కూడా అయిపోవడంతో ఇక పూర్తిగా రైతులు బిజీ అయ్యారు. ఈ ఏడాది ఎక్కడ చూసినా 40 నుంచి 50 బస్తాల దిగుబడి రావడంతో రైతన్నల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గోదావరి జిల్లాల్లో మాదిరిగానే మన జిల్లాలో కూడా వరి దిగుబడి ఈ ఏడాది రానుందని, ప్రస్తుతం జరుగుతున్న వరి నూర్పుల్లో వస్తున్న ధాన్యం దిగుబడి చెప్పకనే చెబుతోంది. జిల్లాలో ఈ ఏడాది 54 వేల హెక్టార్లలో వరి సాగు జరిగింది. ప్రధానంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పేరు చెబితే అందరికీ గుర్తుకొచ్చేది వ్యవసాయమే. చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల, రావికమతం, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, రోలుగుంట మండలాల్లోనే సుమారు 60 వేల ఎకరాల్లో వరి సాగైంది. చాలా చోట్ల పంట పొలంలోనే బాగా పండిపోయి ఎండిపోవడంతో నేరుగా కోసిన వెంటనే నూర్పులు కూడా చేస్తున్నారు. చాలా చోట్ల ధాన్యం నూర్పుల్లో రైతులు బిజీ అయ్యారు.

వేధిస్తున్న కూలీల కొరత..

ఒకేసారి అంతా వరి కోతలు, నూర్పులు చేస్తుండటంతో ఇప్పుడు కూలీలు, యంత్రాల కొరత తీవ్రంగా రైతులను వేధిస్తోంది. కూలీల రేట్లు అమాంతంగా పెరిగాయి. నూర్పుకి ఎకరాకి సుమారు రూ.4 వేల వరకు ఖర్చవుతోంది. నూర్పులకు ట్రాక్టర్లు, కూలీలు, గాలిపోత మిషన్లు, వరి నూర్పు యంత్రాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. పరిమితంగానే ఈ యంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉండటం, కూలీల రేట్లు పెరగడంతో రైతుల పెట్టుబడి కూడా పెరిగింది. పాత పద్ధతిలో నూర్పులు చేస్తే ఖర్చు ఎక్కువ అవుతుండటం వల్ల వరి నూర్పు యంత్రాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ యంత్రం వల్ల తక్కువ సమయంలోనే ధాన్యం చేతికి వస్తుంది. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో కేవలం 8 మిషన్లు మాత్రమే ఉన్నాయి. దీంతో ముందుగా బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ దొరకని వారు ఎడ్లు, ట్రాక్టర్లతో నూర్పులు చేసి గాలిపోత మిషన్లతో ధాన్యం వడపోస్తున్నారు. యంత్రాలు అందుబాటులో లేనివారు సాధారణ ఫ్యాన్లు వినియోగించి గాలిపోత చేస్తున్నారు. మరలా తుపాను హెచ్చరిక వస్తుందేమో అన్న ఆందోళనతో రైతులంతా ఒకేసారి నూర్పులు చేస్తుండటంతో కోతలు, నూర్పులతో గ్రామాలన్నీ సందడిగా ఉన్నాయి.

> **ఈ ఏడు వరి బాగా పండింది**
>
> ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా ఉంది. మధ్యలో తుపాన్లు భయపెట్టినా ఎటువంటి నష్టం జరగకపోవడంతో చాలా ఏళ్ల తర్వాత ఈసారి ధాన్యం దిగుబడి బాగా వచ్చింది. ఎకరాకి 40 బస్తాలకు పైనే దిగుబడి వచ్చింది. యంత్రాలతో తొందరగా పని జరుగుతుందని చూస్తుంటే అవి తక్కువగా ఉండటంతో ఇబ్బందిగా ఉంది.
>
> – అప్పారావు, రైతు, కన్నంపాలెం

వేడుకగా తీర్థ మహోత్సవాలు



కె.జె.పురంలోని నెహ్రూ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరీ దేవి



ప్రత్యేక అలంకరణలో ఎం. కోడూరు మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వద్ద శనివారం ఘనంగా తీర్థం నిర్వహించారు. స్థానిక మదర్‌థెరిసా టాలెంట్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఉదయం నెహ్రూ విగ్రహం వద్ద పాఠశాల విద్యార్థులతో దేశ భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. సాయంత్రం కబడ్డీ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, హైస్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్ కుమార్, జనసేన నాయకుడు కాళ్ల హరి బాలకృష్ణ, వార్డు సభ్యులు ఆడారి వెంకట సూరి అప్పారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కాళ్ల అమ్మతల్లినాయుడు, ఉపాధ్యాయుడు భీశెట్టి ముత్యాలనాయుడు, టాలెంట్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దాలివలస, ఎ.భీమవరంలో..

కె.కోటపాడు: దాలివలసలో ఎరుకులమ్మ పేరంటాలు, ఎ.భీమవరంలో నర్సమాంబ పేరంటాల తీర్థాలను గ్రామస్తులు నిర్వహించారు. శనివారం పేరంటాళ్ల ఆలయాల్లో పూజలు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు.

నేడు ఎం. కోడూరులో మోదకొండమ్మ తీర్థం

మాడుగుల రూరల్: మండలంలోని ఎం. కోడూరు గ్రామ ఆరాధ్యదైవం మోదకొండమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి కబడ్డీ పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఘనంగా దేవితల్లి తీర్థం..

దేవరాపల్లి: గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ ఉమామహేశ్వరీ దేవి (దేవితల్లి) అమ్మవారి కల్యాణం, తీర్థ మహోత్సవం ఘనంగా జరిగాయి. ఐదు రోజుల తీర్థ మహోత్సవాలలో భాగంగా తొలి రోజు శనివారం అమ్మవారికి పురోహితులు నాగేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితప్రసాద్ దంపతులు, చైతన్య జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, పరమేశ్వరీ దంపతులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మంగళాపుంలో..

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి పరుగు పందెం ప్రజల్ని ఆకట్టుకుంది. ఎద్దుల పరుగు పందెంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



మంగళాపురంలో ఎద్దుల పరుగు పందెం

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- డీఎస్పీ శ్రీనివాసరావు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నాతవరం: సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు అన్నారు. ఆయన మొదటిసారి నాతవరం పోలీసు స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ సీహెచ్ భీమరాజును మండలంలోని ప్రధాన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల కట్టడికి నియంత్రణకు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా, దొంగతనాల నివారణకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని నిత్యం వాహనాలు తనిఖీ చేయాలని ఎస్ఐలకు సూచించామన్నారు. మహిళల పట్ల జరుగుతున్న దాడుల నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళా హక్కులు, విధుల పట్ల అవగాహన కోసం సదస్సులు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకు వస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత హరికృష్ణకు ఘన నివాళి



హరికృష్ణ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కరణం ధర్మశ్రీ



వి.జె.పురంలో హరికృష్ణ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వి.జె.పురం మాజీ సర్పంచ్ గూడెపు హరికృష్ణ మృతదేహాన్ని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు కరణం ధర్మశ్రీ శనివారం ఉదయం దర్శించుకుని, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పార్టీకి అంకిత భావంతో పని చేసిన హరికృష్ణ మృతి వైఎస్సార్‌సీపీకి, మండలానికి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ప్రస్తుత సర్పంచ్ యడ్ల కళావతి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, బొద్దపు భాస్కరరావు, కాళింగ కళ్యాణరాజు, బూరె బాబూరావు పాల్గొన్నారు.

క్రీడల పట్ల అవగాహన కలిగి ఉండాలి



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అతిథులు

చీడికాడ: మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం (విశాఖపట్నం) సారథ్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. వాలీబాల్, కబడ్డీ, లాగ్‌జంప్, హైజంప్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్థానిక చైతన్య శ్రీ విద్యాలయం కరస్పాండెంట్ నందారపు రమణబాబు, నెహ్రూ యువకేంద్రానికి చెందిన ప్రసన్నకుమార్, వినయ్‌కుమార్, జ్ఞానదీప్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి హామీ



పయినీర్ యాజమాన్య ప్రతినిధులకు డిమాండ్ల పత్రం అందజేస్తున్న నాయకులు

మాకవరపాలెం: మండలంలో ఉన్న ఆన్‌రాక్ (పయినీర్) అల్యూమినియం రిఫైనరీకి అధిక లోడుతో బాక్సైట్ ముడి ఖనిజాన్ని తరలిస్తున్న లారీల కారణంగా రోడ్లు పాడవడం, ప్రమాదాలు జరుగుతున్నాయంటూ శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం సర్పంచ్‌లు అల్లు రాము నాయుడు, రుత్తల నందకిషోర్, దుంగల వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ నెల 5న స్థానికులు 120 లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. గత నాలుగు రోజులుగా ఈ నిరసన కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు పయినీర్ ట్రాన్స్‌పోర్ట్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే సర్పంచ్‌లతో చర్చలు జరపడంతో పలు డిమాండ్లను వారి ముందుంచారు. మొదటి డిమాండ్ అయిన రోడ్డు విస్తరణకు సంబంధించి వెంకన్నసపాలెం నుంచి కంపెనీ వరకు రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులను యాజమాన్యం ప్రారంభించింది. ఈ మేరకు శనివారం పయినీర్ యాజమాన్యం, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు సంయుక్తంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు లారీలను నడుపుతామని, మిగిలిన డిమాండ్లను కూడా పరిష్కరిస్తామని నిరసనకారులకు హామీ ఇవ్వడంతో లారీలను విడిచిపెట్టారు. 15 రోజుల్లోగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే మరలా లారీలను అడ్డుకుంటామని నిరసనకారులు స్పష్టం చేశారు. డిమాండ్లతో కూడిన పత్రాన్ని యాజమాన్య ప్రతినిధులకు అందజేశారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు



బాబాను దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు



కె.జె.పురం రామాలయంలో ఏకాహంలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో అర్జునగిరి నృసింహస్వామి



మాడుగులలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్: భీష్మ ఏకదశి పర్వదినం సందర్భంగా కె.జె.పురం రామాలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక భక్తుడు పిళ్లా రాము సహకారంతో శనివారం రాత్రి చద్ది ఏర్పాటు చేశారు. భజన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో లక్ష దీపారాధన..

నర్సీపట్నం: లక్ష ప్రమిదల దీపారాధన మహోత్సవం ఘనంగా జరిగింది. భీష్మ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని సాయిబాబా ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు భారీ ఎత్తున బాబాను దర్శించుకుని పూజలు చేశారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి బాబాను దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 23వ లక్ష ప్రమిదల దీపారాధన వైభవంగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. ఆలయ ప్రెసిడెంట్ చింతల పాత్రుడు, వైస్ ప్రెసిడెంట్ బొంతు రమేష్, కార్యదర్శి రాజు, కోశాధికారి ఈశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో..

చోడవరం: చోడవరం శ్రీ కేశవస్వామి ఆలయంలో స్వామి వారి 752వ వార్షిక బ్రహ్మోత్సవం, భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి పురవీధుల్లో వైభవంగా తిరువీధి నిర్వహించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

మాడుగుల: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా మాడుగుల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వడ్డాది భ్రమరాంబిక.. మల్లికార్జునస్వామి ఆలయంలో..

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పూజలు జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జంపెన రామాలయంలో..

మాడుగుల: జంపెన రామాలయంలో శనివారం ఏకాదశి ప్రత్యేక పూజలు, ఏకాహం నిర్వహించారు. భక్త బృందం సభ్యులు వానపల్లి ధర్మారావు సారథ్యంలో శ్రీరామాంజనేయ భక్త బృందం కార్యక్రమం నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి భీష్మ ఏకాదశి పర్వదినం రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నేమాలు గురువునాయుడు తెలిపారు.

అర్జునగిరి నృసింహస్వామి ఆలయంలో..

చీడికాడ: మండలంలోని అర్జునగిరి గ్రామంలో గల అతి పురాతన దేవాలయం అయిన శ్రీ స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు, భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పాణంగిపల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలు గ్రామ సర్పంచ్ బి. రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు పి. అమ్మతల్లినాయుడు దంపతుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జాజిమొగ్గల సత్యనారాయణ, చొక్కాకుల దాలినాయుడు, పెంటకోట నూకునాయుడు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రోలుగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

రోలుగుంట : శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. భక్తుల గోత్రనామాలతో ఆలయ అర్చకుడు రేజేటి శ్రీనివాసరావు అభిషేకాలు చేసి ప్రసాద వితరణ జరిపారు.



వడ్డాది భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామికి ఏకాదశి పూజలు చేస్తున్న అర్చకులు



రోలుగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శ్రీదేవి,భూదేవి సమేత కేశవ స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి సుబ్బారాయుడుపాలెంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హోమాలు, పూజలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శనివారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలకగా అర్చకులు పట్టు వస్త్రాలు కప్పి సీతారాముల దర్శనం కల్పించారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు తమరాన శ్రీనివాస్, మాకిరెడ్డి బుల్లిదొర, మున్సిపాలిటీ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఏకా శివ, స్థానికులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

నర్సీపట్నం: స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో తుని మదర్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక కృష్ణాబజార్‌లోని సంపత్ వినాయక ల్యాబ్ వద్ద శిబిరాన్ని నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు టి.మల్లేష్ మాట్లాడుతూ సుమారు 30 మంది రక్తదానం చేయగా 50 ఏళ్లు పైబడిన వారు కూడా పాల్గొని ఆదర్శంగా నిలిచారని తెలిపారు. తమ బ్లడ్ బ్యాంకు ద్వారా గర్భిణీలు, సికిల్‌సెల్, ప్రమాదాలకు గురైన వారికి సుమారు 300 మందికి రక్తాన్ని అందించినట్టు చెప్పారు. అమ్మ ఆస్పత్రి డాక్టర్ జి.వి.రాజు, ఆర్థోపెడిక్ డాక్టర్ నూకరాజు, ఉమానారాయణ పిల్లల ఆస్పత్రి డాక్టర్ పుల్లేటికుర్తి మల్లికార్జున, రిషి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మురళి, మదర్ బ్లడ్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ గుప్త హాజరయ్యారు.

విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలి

మాడుగుల రూరల్: పాఠశాల, కళాశాలల విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలని స్థానిక పోలీసు స్టేషన్ మహిళా పోలీసులు దీపిక, రామలక్ష్మి పేర్కొన్నారు. శనివారం రాత్రి మాడుగులలోని హైస్కూల్, కళాశాల వసతి గృహాల విద్యార్థినులకు ఎస్ఐ జి. నారాయణరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైంగిక వేధింపులు, మహిళా చట్టాల గురించి వివరించారు. హెచ్‌సీలు పాల్గొన్నారు.